www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఆగస్టు 2023
5
వైఎస్ఆర్



వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాల విద్యార్థుల 2,4,5,6 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలసి శుక్రవారం విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో 5,250 మంది విద్యార్థులు హాజరు కాగా 3,177 మంది ఉత్తీర్ణులయ్యారు. 60.51 శాతం లభించింది. 4వ సెమిస్టర్ పరీక్షలకు 9,041 మంది హాజరుకాగా 4,249 మంది పాసయ్యారు. 47.శాతం ఫలితాలు వచ్చాయన్నారు. 5వ సెమిస్టర్ 9810 మంది విద్యార్థులు కాగా 6387 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. 65.11శాతం ఫలితాలు లభించాయన్నారు. 6వ సెమిస్టర్‌కు 10, 142 మంది హాజరుకాగా 9,310 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 91.80 శాతం వచ్చిందన్నారు. ఈ ఫలితాలలో రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్ర ఓబులరెడ్డి, సహాయ పరీక్షల అధికారులు డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, డాక్టర్ సుమిత్ర పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాలను మరింత లాభాల బాటలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ వి.విజయ రామరాజు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి.శివ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగును మించి విస్తీర్ణ లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన సాగు నీటిని అందించేందుకు సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడాలన్నారు. ఆర్‌బికెల పరిధిలో వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం మొదలైన ప్రక్రియల నిర్వహణపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలని తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రాగి, జొన్న, కంది పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఆర్‌బికెలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన, వ్యవసాయాధికారులు ఆమోదించిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ గోడౌన్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల పశు వైద్యులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీకాలు వేయించాలని తెలిపారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, అనుబంధ శాఖల శాఖల సాధించిన ప్రగతిని, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును, ఆర్‌బికె సేవలను వివరించారు. సమావేశంలో జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ రవీంద్రరెడ్డి, సీఎంఎస్‌ఏ (ప్రకృతి వ్యవసాయం) డిపిఎం రామక్రిష్ణ, ఆత్మ పీడి విజయ కుమారి, డీసీఓ సుభాషిణి, ఎల్డీఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, పట్టు పరిశ్రమ శాఖ ఎడి శ్రీనివాసుల రెడ్డి, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, సహకార, సివిల్ సప్లై, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉక్కు' సాధనకు పోరాటమే మార్గం

- సెయిల్ చైర్మన్ కడపలో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి
- బిజెపి ఢిల్లీ పెద్దలు రాయలసీమ డిక్లరేషన్ గాలికొదిలేశారు
- బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని మాట తప్పారు
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్


ప్రజాశక్తి - కడప అర్బన్

ఉక్కు పరిశ్రమ సాధనకు యువతకు పోరాటమే ఏకైక మార్గమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో డిఐఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప ఉక్కు సాధనకై 'రాష్ట్రస్థాయి సదస్సు' జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సదస్సుకు రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, పశ్చిమ రాయలసీమ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కడప ఉక్కు సాధనా కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన ఇనుప ఖనిజం, సున్నపురాయి, నిఖేల్, డోలమైట్ తదితర మూలకాలు విస్తృతంగా దొరుకుతున్నాయన్నారు. విద్యుత్తు ఆర్టీపీపీ నుంచి, నీరు మైలవరం, గండికోట, బ్రహ్మ సాగర్ నుంచి, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, ముద్దనూరు రైలు మార్గం ద్వారా, కృష్ణపట్నం నుంచి ఓడ మార్గం రవాణా సౌకర్యం ఉందని తెలిపారు. 2010లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లాలో బ్రాహ్మిణి స్టీల్ కు శంకుస్థాపన చేసి, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని తలపెట్టారన్నారు. ఆయన మరణించడం, రాష్ట్రం విభజన జరగడం, ప్రభుత్వాలు మారడంతో బ్రాహ్మిణి స్టీల్ రూ.1050 కోట్లు ఖర్చుపెట్టి తరువాత చేతులెత్తేశారని పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో కడప ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వ ఉక్కు పరిశ్రమల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని పార్లమెంటు సాక్షిగా, రాష్ట్రపతి ఆమోదంతో రాతపూర్వకంగా చట్టంలో పొందుపరిచారన్నారు. అప్పట్లో పాలక, ప్రతిపక్షాలు ఆమోదం తెలిపాయని పేర్కొన్నారు. కరువు తీవ్రంగా ఉన్న ప్రాంతం రాయలసీమలో ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమ ఒకటీ లేదని, ఈ ప్రాంత అభివృద్ధికి కడప ఉక్కు పరిశ్రమ ప్రాణ వాయువు లాంటిదని చెప్పారు. బిజెపి రాష్ట్ర నాయకులు కర్నూల్‌లో రాయలసీమ డిక్లరేషన్ పేరిట కడప ఉక్కు నిర్మిస్తామని ప్రకటించారని, అదే బిజెపి పెద్దలు ఢిల్లీలో పార్లమెంటులో కడప ఉక్కు సాధ్యం కాదని మోసం చేశారన్నారు. సెయిల్ చైర్మన్ కడప జిల్లాకు వచ్చి 'పబ్లిక్ హియరింగ్' నిర్వహించాలని అప్పుడే నిజాలు వెల్లడవుతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లూస్ థింకింగ్ చేస్తున్నాయని వాపోయారు. బిజెపి ఆంధ్ర రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాలు లేవని తప్పుడు రిపోర్ట్ తెప్పించుకుని కడప ఉక్కు నిర్మించకుండా తప్పించు కుంటుందన్నారు. సదస్సులో జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, రాజేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, రెబ్బా నరసింహులు, నగర అధ్యక్ష, కార్య దర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు షరీఫ్, మస్తాన్, ఆంజనేయులు, సురేంద్ర, పుల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారించాలి

- ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



వినతి పత్రం అందజేస్తున్న దస్తగిరిరెడ్డి

మైదుకూరు పసుపు కొనుగోలులో జరిగిన అక్రమాలు, అవినీతిపై నిష్పక్షపాతంగా విచారించాలని విచారణ కమిటీ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావుకు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ , మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ల అండదండలతోనే పసుపు కొనుగోలులో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. నాసిరకం పసుపు కొనుగోలు చేశారని వాటిని గోడౌన్స్ పంపిన తర్వాత తిరస్కరణకు గురైందని, ఆ పసుపును 1500 బస్తాలను డిసి ఎంఎస్ అధికారులు, రైతులకు చేర్చాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. వాటిని తిరిగి ఇవ్వ కుండా, రైతులకు తెలియకుండా అమ్ముకోవడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. పసుపు అవినీతి కొనుగోలు, అక్రమాలు, అవినీతి పై కలెక్టర్ విచారణ కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. నిష్పక్షపాతంగా రాజకీయాలకతీతంగా విచారణ కమిటీ విచారించి రైతు లను మోసం చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని కోరారు. విచారణ కమిటీకి ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ పూర్తి ఆధారాలు, వీడియోలు, ఆడియోలతో నివేదికను అందించామని పేర్కొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి - కడప రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న టెక్నికల్ డైరెక్టర్

లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టెక్నికల్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. సుబ్బరాజు అన్నారు. శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో సుబ్బరాజు అధ్యక్షతన కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లి మర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని సులభతరంగా అంతరాయ కారణాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ కోసం నిర్వహిస్తున్న సర్వేను అధిక ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రాధాన్యతతో దృష్టి సారించాలన్నారు. విద్యుత్ బిల్లులపై వచ్చే వ్యత్యాసాలు అధిగమించడానికి ఆధునిక పద్ధతిలో ఐఆర్‌డిఎ పోర్టు ద్వారా ఆటోమేటిక్ రీడింగ్ తీసే విధానాన్ని నూరు శాతం మీటర్లకు తీయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఉద్యోగి సంస్థకు, వినియోగదారులకు మధ్య వారధిగా ఉంటారని, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. పనులలో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని అధికారులకు తెలియజేశారు. పనితీరులో మార్పు రాకపోతే శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఓఎస్‌డి ఎన్. శ్రీనివాసులు, వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలి : ఫ్యాప్టో

కడప అర్బన్ : బదిలీలు నిర్వహించి మూడు నెలలు కాకుండా మళ్లీ ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేయడం పట్ల ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, పని సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధాలను నిలుపుదల చేయాలని ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ యాపరాల వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. దీనిపై శనివారం సాయంత్రం ఐదు గంటలకు డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు శుక్రవారం నోటీసును జిల్లా విద్యాశాఖ కార్యాలయం పరిపాలనాధికారి మునీర్ ఖాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 2023, జూన్ లో బదిలీలు, రేషనలైజేషన్, ప్రమోషన్స్ రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిందని, ఈ బదిలీలలో 10వేలమంది పైగా ఉపాధ్యాయులకు 3 నెలలు కావస్తున్నా జీతాలు అందలేదని విమర్శించారు. బదిలీలలో రిలీవర్ రాని కారణంగా ఇప్పటికీ సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా అదే పాఠశాలలో కొనసాగుతున్నారనిచెప్పారు. ప్రస్తుతం వీరిని రిలీవ్ చేసినా మళ్లీ అదే పాఠశాలలో విధులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బదిలీలలో సాంకేతిక సమస్యలు వల్ల కొద్దిమంది ఉపాధ్యాయులు ఇప్పటికీ పాఠశాలలో చేరకుండా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పని సర్దుబాటు, జీతాలు సమస్య, ఒత్తిడితో ఉపాధ్యాయులు బోధనపై కేంద్రీకరించ లేకపోతున్నారని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను పెద్దఎత్తున బదిలీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పాలెం మహేష్ బాబు, ఖాదర్ బాషా, భాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, హరి కొండయ్య, కరీముల్లా, మునెయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు అన్నారు. శుక్రవారం నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో తన కార్యాలయంలో సయ్యద్ యూనుస్ 43వ డివిజన్ అధ్యక్షులుగా నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండా రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, కొండా సుబ్బయ్య, నజీర్, మేకల వెంకటేష్ యాదవ్, సానపు రెడ్డి రవి శంకర్ రెడ్డి, బండి జయశేఖర్, గాజులపల్లె రాఘవ, మేకల దేవ, దస్తగిరి, ప్రేమ్ కుమార్, షేక్. ఇమ్రాన్, ఆదిల్, ఆరిఫ్ పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలలో విధులు సక్రమంగా నిర్వహించకపోతే అలాంటి ఉపాధ్యాయులపైనా, సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకొంటామని రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి వేంపల్లెలోని కుప్పాలపల్లి రోడ్డులో ఉన్న ఉర్దూ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను కలిసి విద్యా బోధన, వసతి, భోజనంపై ఆరా తీశారు. ప్రిన్సిపల్ సుగుణమ్మను విద్యార్థుల సంఖ్యను ఆడిగి తెలుసుకొన్నారు. ఒక్కో తరగతి గదికి 80 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా 38 మందికి మాత్రమే ఎందుకు కూర్చోబెట్టారని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మండిపడ్డారు. 40 మంది విద్యార్థుల కోసం భవనాలు, ఉపాధ్యాయు పోస్టులు, కోట్లాది రూపాయల బడ్జెట్ విడుదల చేయడం అవసరమా అన్నారు. ఆయన వెంట ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనువాసులురెడ్డి, ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి డిఇఒ రాఘవ రెడ్డి, ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డివిఇఒ శ్రీనువాసులు రెడ్డి, ఎఇఒలు వీరారెడ్డి, స్టాలిన్ ఐజాక్, వైసిపి నాయకులు మారం శ్రీకాంత్ రెడ్డి,గ్రామ సచివాలయ సిబ్బంది, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులకు బదిలీల అవ కాశం కల్పించాలని ఎపి ఎన్‌జివిఎఫ్ నాయ కులు కోరారు. శుక్రవారం వారు పశుసంవర్ధకశాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఆర్. అమరేంద్రకుమార్‌కు, జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాఖలో పారా వెటర్నరీ కౌన్సిల్ యాక్ట్ 2023 ప్రకారం ఏర్పడిందని పేర్కొన్నారు. దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను ఎహెచ్‌ఎల్‌తో భర్తీ చేయాలన్నారు. ఎహెచ్‌ఎలకు బిఎల్‌ఒ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జివిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సదాశివయ్య, వెంకటసుబ్బయ్య, విద్యాసాగర్, మణి, బాబు నాయక్, షాహిదా బేగం, హిమబిందు, సాల్మన్ రాజ్ మోహన్ సాయి, ఎహెచ్‌ఎ అసోసియేషన్ వీరకుమార్, చెల్లు గణేష్, వెంకటేష్, ప్రసాద్, ఇమ్మానియేల్, హేమంత్, విజయమ్మ ,వసుంధర, ల్యాబ్ టెక్నీషియన్స్ నుంచి మేరీ, అభిలాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

అసైన్డ్ చట్టంపై ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న వి. అన్వేష్

ప్రభుత్వ భూములు అమ్ముకోవచ్చు అనే ఆర్డినెన్సును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శివకుమార్, అన్వేష్ డిమాండ్ చేశారు శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, పేదలకు నష్టం కలిగించే అసైన్డ్ ఆర్డినెన్సు రద్దు చేయాలని ఈనెల 20 న ఉదయం 10 గంటలకు కడప సిఐటియు జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి జిల్లాలో ఉన్న ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, వామపక్ష నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీ సమావేశాల్లో అసైన్డ్ భూములు 20 సంవత్సరాల తర్వాత యాజమాన్య హక్కులు కల్పిస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే వ్యతిరేకించారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చి మడమతిప్పి పదేళ్లకే ఇళ్ల స్థలాలు, 20 సంవత్సరాలకు సాగు భూములు రిజిస్ట్రేషన్ చేపడతామని రాష్ట్ర క్యాబినెట్లో ఆమోదించటం, గవర్నర్ చేత ఆగమేఘాల ఆర్డినెన్స్ తీసుకురావడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికే దళితులు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు వేల ఎకరాలు అన్యాక్రాంతం తమయ్యాయని పేర్కొన్నారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా సంఘం పోరాట ఫలితంగా 9/77 అసైన్డ్ చట్టప్రకారం కొన్ని భూములు తిరిగి పేదలకు ఇచ్చారని తెలిపారు. భూములు అమ్మకూడదు, కొనకూడదు అనే చట్టం ఉన్నప్పుడు వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైతే రాజశేఖర్ రెడ్డి కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసైన్డ్ చట్టాన్ని సవరించటం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పెద్దలకు, భూస్వాములకు, భూ కబ్జాదారులకు ఉపయోగపడేలాగా ఆర్డినెన్స్ తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అలుపెరగని సేవలకు అరుదైన సత్కారం

ప్రజాశక్తి- కడప అర్బన్

తమ విధుల్లో ప్రతిభ చూపుతూ సేవారంగాల్లోనూ అలుపెరగని సేవలకు అరుదైన సత్కారం అందిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామి రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పోతుల ట్రావెల్స్ కార్యాలయంలో జిల్లా బిసి, మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఫోర్త్ ఐ మాసపత్రిక సంపాదకులు సూరి బాబు, ఎఆర్ఎస్ఐ బోగాల కొండా రెడ్డిని ఘనంగా సత్కరించారు. వారి విశిష్ట సేవలకు స్వాతంత్ర్యదినోత్సవ ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ విజయరామరాజు, ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్‌ల ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా పోతుల వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో బాధ్యతలు నిర్వహించే అధికారిగా వల్లూరు బ్రహ్మయ్య ప్రభుత్వ అధికారుల ప్రశంసలందుకున్నారని సామాజిక సేవా రంగాలపై మక్కువతో ఆయన చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి జిల్లా అధికారులు ఆయన సేవలను గుర్తించడం ప్రశంసనీయమన్నారు. ఇక తనదైన శైలిలో సేవలు చేస్తూ, ఎదుటివారి మన్ననలు పొందుతున్న ఎఆర్ఎస్ఐ బోగాల కొండారెడ్డి ప్రభుత్వ అధికారుల ప్రశంసలు పొందారన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జోన్ చైర్మన్ డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులు పద్మప్రియ చంద్రా రెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో అధికారుల ప్రశంసలు పొందడం క్లబ్బు సభ్యులకు స్ఫూర్తిని వ్వగలదన్నారు కార్యక్రమంలో డాక్టర్ హరిహరనాథ రెడ్డి, పవన్ కుమార్. గంగాధర్, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

రమేష్‌నాయుడుకు డాక్టరేట్

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ పరిశోధకులు బండమీద రమేష్ నాయుడుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'డెవలప్మెంట్ ఆఫ్ సస్టైనబుల్ మెతడాలజిస్ టు ఆక్సెస్ ఇమైన్స్, హెటిరో సైక్లిక్స్, బైఅరైల్స్, కార్బోమేట్స్, అండ్ ఫ్యాటీ ఆసిడ్ ఎస్టర్స్' అనే అంశంపై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని రమేష్ నాయుడు విశ్వ విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. విసి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు.

నేతాజీ యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రిటీష్ పాలన నుంచి భారత్‌ను విముక్తి చేసేందుకు నిర్వహించిన స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరిగిన పోరాటం చేసిన నేతాజి సుభాష్ చంద్రబోస్ మహనీయుడని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 78వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నేతాజీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్య మంలో ఎంతో చురుకైన పాత్ర పోషించి రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయాల సాధమే నిజమైన నివాళులన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి,అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఇ.సీ.సుప్రియ,సేవా పథక ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఉషా మాధురీ, రమాదేవి, నేషనల్ ఈవెంట్ కో-ఆర్డినేటర్ మనోహర్ రావ్, అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి కడప అర్బన్



గండి సునీల్‌కుమార్



సగిలి రాజేంద్రప్రసాద్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశంలో కడప జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నిక కార్యక్రమం పూర్తి చేశామని పేర్కొన్నారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షులు గండిసునీల్ కుమార్, కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.ఆర్.నాయక్, రాహుల్, వినయ్, సహాయ కార్యదర్శులు వీరపోగు రవి, కరిష్మా, కమిటీ సభ్యులు అజయ్, రాజశేఖర్ రెడ్డి, సుమంత్, మనోజ్, సురేష్ నాయక్, రాకేష్, మనోజ్, సోనియాను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, నాణ్యమైన విద్యా, ఉపాధి కోసం జిల్లా వ్యాప్తంగా రాబోవురోజుల్లో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను ఇచ్చిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఫారం 10-ఎ గడువు పొడిగింపు

కడప అర్బన్ : స్మిత్ రోడ్‌లో ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆదాయపు పన్ను చట్టాలు, ఫారం10-ఎ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను సంచాలకులు మినహాయింపు బి. బాలకృష్ణ, సంయుక్త సంచాలకులు కోటేశ్వరమ్మ ఆదేశాలు నన్నుసరించి అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలో ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్, ఆడిటర్స్, స్వచ్ఛంద సంస్థ, ఆదాయపు పన్ను చట్టాలు, నూతన సవరణలు, ఫామ్ 10ఎ మీద అవగాహన నిర్వహించారు. ఫామ్ టెన్ సెప్టెంబర్ 30 గడువు లోపల ఫైల్స్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప జిల్లా చార్టర్డ్ అకౌంటెంట్ అధ్యక్షులు కాజా హుస్సేన్, నిహార్స్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జయరామ్ తో పాటు నగరంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హర్షణీయం

కడప సిటీ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన ఆ హామీని నెరవేర్చడం హర్షణీయమని వైద్య,ఆరోగ్య శాఖ యూనియన్ నాయకులు వెంగల్‌రెడ్డి, మేసా ప్రసాద్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని కమిటీ ఇచ్చిన నిబంధనను సైతం తొలగించి ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ కానుక అందించారని తెలిపారు. గత ప్రభుత్వం 2014 ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తకుండా కేవలం కమిటీలతో కాలయాపన చేశారన్నారు. ఇప్పుడు ముఖ్య మంత్రి మేనిఫెస్టోలో చెప్పిన మాట ప్రకారం 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తీర్మానించారని తెలిపారు. ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో ఐదేళ్ల నిబంధన తొలగించి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయన్నారు. 20 ఏళ్ల నుంచి రెగ్యులర్ కాకుండా ఉద్యోగంలో ఆర్థిక భారంతో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు వారి కుటుంబాల్లో వెలుగులు నింపి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.


రక్తదాన శిబిరంలో ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, షబ్బీర్ వలి

రక్త సేకరణ హర్షణీయం

- ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తసేకరణకు రక్తదాన శిబిరాలను నిర్వహించడం హర్షణీయమని ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ పేర్కొన్నారు. స్థానిక గాంధీ రోడ్డులోని ఆర్ఎంఎస్ వీధిలో ఎంజె గ్రీన్ ట్రెడ్స్ ఆధ్వర్యంలో కడపకు చెందిన ఖాన్ కా రీస్తా, బోగ పార్వతమ్మ బడ్ల్ సెంటర్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎపిఐఐసి డైరెక్టర్, ఎంపిపి లక్ష్మి గాయత్రి, షబ్బీర్‌వలి ప్రారభించారు. దాదాపు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉత్సాహంగా రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్త నిల్వ కేంద్రాల్లో రక్తం నిల్వ ఉంటే ఆపదలో ఉన్న వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతలో అవగాహన కల్పించేందుకు రక్త నిల్వ కేంద్రాల నిర్వాహకులు ఆయా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజె గ్రీన్ ట్రెడ్స్ బ్యూటీ పార్లర్‌ను ప్రారభించారు. కార్యక్రమంలో హజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్, భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ సల్మా, ఎంపిటిసిలు భారతి, రహంతుల్లా ఖాన్, ఎంజె గ్రీన్ ట్రెడ్స్ బ్యూటీ నిర్వహకురాలు మేహతాబ్, మదార్ షా వలి, ఖాన్ కా రీస్తా ప్రతినిధి సమీర్, చానుబాషా, మౌల్లా టైల్స్ యజమాని నజీర్, వైసిపి నాయకులు రాచినేని వేణు, బాబా షరీఫ్, మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సంస్థ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- హ్యూమన్ రైట్స్ ఆల్ ఇండియా ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ శివనారాయణ యాదవ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్




ప్రజలకు తనవంతు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని ఆల్ ఇండియా మానవ హక్కుల ఎపి వైస్ చైర్మన్ దంపేట్ల శివనారాయణ యాదవ్ పేర్కొన్నారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనను ఆ పదవిలో ఆల్ ఇండియా కౌన్సిలింగ్ సమావేశంలో (విజయవాడలో) నేషనల్ చైర్మన్ ప్రసన్నకుమార్ నియమించారన్నారు. తన మీద నమ్మకంతో ఇంత పెద్ద పదవి ఇచ్చిన పెద్దలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మానవ హక్కుల ద్వారా ప్రజలకు కలిగే ఉపయోగాలను తెలివి, వారికి ఏ సమస్య వచ్చినా లేదా తన దృష్టికి తీసుకు వచ్చినా వెంటనే స్పందిస్తానన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తానని తెలిపారు. తాను ఇది వరకే దేశ రక్షణ రంగమైన మిలటరీలో పని చేసి రిటైర్మెంట్ అయ్యానని, తర్వాత పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కొంచమైనా న్యాయం చేద్దామనే ఉద్దేశంతోనే ఈ పదవిలోకి వచ్చానని చెప్పారు. అందరి సహకారంతో ముందుకు వెళ్తానన్నారు.

మండలంలో ఏర్పాటు కానున్న మెగా ప్రాజెక్టు

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం మండలం తిరుమలాయపల్లె గ్రామపరిధిలో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి మెగావాట్స్ జల విద్యుత్ ప్రాజెక్టును తీసుకరానుంది. రాష్ట్రంలో ప్రాజెక్టుల బాట పట్టిస్తున్న వేళ నెడ్ క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్థానిక ప్రజల అభిప్రాయం కోసం శుక్రవారం జెసి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సభను ఏర్పాటు చేశారు. ప్రజలతో అక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రాజెక్టు ఉద్దేశం, ప్రజా అవసరాలు, ప్రజా ఉపయోగాల గురించి చర్చించారు. ప్రాజెక్టునకు 600 ఎకరాల భూమి అవసరమన్నారు. వాటితోపాటు గండికోట ప్రాజెక్టు నుంచి 3.5 టిఎంసి నీరు అవసరం కానుంది. నీటిని ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తామని తెలిపారు. తాము మారుమూల ప్రాంతంలో నివసిస్తున్నామని, గామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరారు. బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామస్తులకు 70 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, నెడ్ క్యాప్ సంస్థ అధికారులు, పర్యావరణ అధికారులు, తహశీల్దార్ శోభన్‌బాబు, రెవెన్యూ అధికారి ఆనందరావు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చక్రాయపేట: మండలంలోని నెర్సుపల్లె గ్రామంలో సాగైన వేరు శనగ పంటను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సారి వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉన్నందున, పంట బెట్ట నుండి తట్టుకోవడానికి ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. తద్వారా తీవ్ర బెట్ట నుండి పంటను 15 రోజుల వరకు కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపిఇఒ శ్వేత, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంగమ్మ దేవాలయంలో చోరీ

ప్రజాశక్తి - లింగాల


హుండీని పరిశీలిస్తున్న సిఐ

మండల పరిధిలోని అంబకపల్లి గ్రామ గంగమ్మ దేవాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం రైతులు పొలం పనుల నిమిత్తం వెళ్తుండగా హుండీ రోడ్డు పక్కన ఉండ డాన్ని గమనించారు. విషయాన్ని పోలీసులకు తెలిపారు. పులివెందుల సిఐ మద్దిలేటి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. హుండీలో దాదాపు లక్ష రూపాయలుపైగా ఉంటుందని గ్రామస్తులు సిఐకి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

వస్త్ర దుకాణంలో..

కొండాపురం: తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కన గురువారం అర్ధరాత్రి తాళ్ళప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఇండ్ల వెంకటరెడ్డికి చెందిన వెంకట తిరుమల శారీ సెంటర్‌లో చోరీ జరిగింది. చోరీలో దాదాపు రూ.2 లక్షల 30 వేలు విలువచేసే వస్త్రాలు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జాతీయ రహదారి పక్కగా ఉన్న ఇళ్లల్లో, దుకాణాల్లో అంతర్జాతీయ దొంగలు ఎక్కువగా చోరీలు చేస్తున్నారనే విషయం తెలిసిందే. అర్ధరాత్రి సమయంలో పోలీసుస్టేషన్ ఎదురుగా శారీస్ సెంటర్ ఉన్న 2 వీధులలోని వీధిలైట్లకు కూడా విద్యుత్ లేకుండా పోయింది. ఈ సమయంలోనే దొంగతనం చేసి ఉండవచ్చునని తెలుస్తోంది. జాతీయ రహదారి పక్కగా నివాసం ఉండే ప్రజలు, వ్యాపారులు భయాందోళనలకు గురవుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు. కొండాపురం సిఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వాలంటీర్ అరెస్టు

ప్రజాశక్తి - కాశినాయన

మండల పరిధిలోని ఆకుల నారాయణపల్లి గ్రామానికి చెందిన చెన్నారెడ్డి అనే వాలంటీర్ తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతన్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. రెండు రోజుల క్రితం నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

బాబోయ్.. కుక్కలు

విచ్చలవిడిగా సంచారం - నియంత్రణ చర్యలు చేపట్టని అధికారులు


పట్టణంలోని రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. నిత్యం ఎక్కడో చోట కుక్కలు దాడులకు తెగబడుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో రాజంపేటలో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేయడం, రాయచోటి, పల్నాడు, శ్రీకాకుళం వంటి జిల్లాలతోపాటు విజయవాడ నగరంలో కూడా ఒకేరోజు 19 మందిపై జరిగిన కుక్కల దాడులను పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. వీధి కుక్కల వల్ల కొన్నిచోట్ల ప్రజలు ప్రాణాలు పోతుంటే.. మరికొన్ని చోట్ల గాయాల పాలవుతున్నారు. ఎర్రగుంట నగర పంచాయతీలో వీధి కుక్కలు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న కూడా కుక్కలు బండ్ల వెనకాల పరిగెడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇక చిన్న పిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. దేశవ్యాప్తంగా వీధి కుక్కలు కరవడం కారణంగా సంవత్సరానికి 100 మందికిపైగా రాబిస్ వ్యాధి సోకుతుందని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. వాటి వల్ల చనిపోయే వారెందరో, గాయాల పాలవుతుంది ఇంకెందరో లెక్కేలేదు. ఈ ప్రమాదకర పరిస్థితులున్నా కూడా వీధి కుక్కల నియంత్రణకు ఎర్రగుంట్ల నగర పంచాయతీ అధికారులు, నాయకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వీధి కుక్కలను సంహరించకూడదు అని చట్టాలు చెబుతున్నాయి.. కానీ అవే చట్టాలు దాడులకు వీధి కుక్కలు, పెంపుడు కుక్కలను సంరక్షించే వారే బాధ్యత వహించాలని చెబుతున్నాయి. మరి ఆ చట్టాలు ఎందుకు అమలు చేయడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు, ఇటు నాయకులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కల దాడుల్లో ప్రజల ప్రాణాలు పోతే తప్ప అధికారుల్లో, నాయకుల్లో స్పందన రాదాని ప్రశ్నిస్తున్నారు. వీధి కుక్కలు దాడులు చేసినా బాధితులకు ఎలాంటి ప్రమాదం కలుగకుండా మున్సిపల్ సిబ్బంది వ్యాక్సినేషన్ వేయాలని, సంతానోత్పత్తి కలగకుండా స్టెరిలైజన్ చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. వీధి కుక్కల దాడుల నుండి ప్రజలను కాపా డడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని జంతు ప్రేమికులు అంటున్నారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు జరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజన్ ఇంజక్షన్లు వేయాలని పలువురు కోరుతున్నారు.

స్టెరిలైజన్ సెంటర్లు లేక ఇబ్బందులు..



స్టెరిలైజన్ సెంటర్లు లేక ఇబ్బందులు పడు తున్నాం. మునుపు ప్రొద్దుటూరు, కడపలో స్టెరిలైజన్ సెం టర్లు ఉండేవి. వాటిని తొలగించి మదనపల్లిలో సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీధి కుక్కలకు స్టెరిలైజన్ ఇంజక్షన్లు వేయాలని పలుమార్లు తెలిపాం. వారు రాకపోవడంతోనే వీధి కుక్కల నియంత్రణ చర్యలు ఆలస్యం అవుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీధి కుక్కలను సంహరించకూడదనే నిబంధనలు ఉన్నాయి. త్వరలోనే వీధి కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజన్ ఇంజక్షన్లు వేయించేలా చర్యలు చేపడతాం.

- పగడాల జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్, ఎర్రగుంట్ల

కెసి కాలువకు నీటి విడుదలపై త్వరలో నిర్ణయం

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి కెసి కాలువకు నీటి విడుదలపై త్వరలో స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మండలం సుంకులవారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా పడడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు వచ్చి చేరలేదన్నారు. గత ఏడాదిలో ఈ సమయానికి కెసి కాలువకు నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం 880 అడుగులకు నీరు రాక ముందే నీటిని విడుదల చేస్తే వరి పంటకు పూర్తిగా నీటిని సరఫరా చేయడం కష్టమవుతుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. నీటి విడుదలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో స్పష్టమైన ప్రకటన విడుదల చేస్తామన్నారు. వరి సాగు చేసే రైతులు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్ నారాయణ రెడ్డి, ఉప మండలాధ్యక్షులు రఘురామిరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చెత్త రహిత సమాజమే లక్ష్యం..

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో చెత్త రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చెత్తను సేకరించే ఆరు ఆటోలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా పట్టణ సుందరీకరణ, పరిశుభ్రత లక్ష్యంగా పాటుపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భారంగా భావించకుండా చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటికి రూ.10 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, మునిసిపల్ కమిషనర్ రంగస్వామి, చాపాడు ఎంపిపి టి.లక్షుమయ్య, దువ్వూరు ఎంపిపి జయచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగన్న, మైనారిటీ నాయకులు సౌకత్ అలీ, నాయకులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చెత్త సేకరణ ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎంపిపి


భూమిపూజ చేస్తున్న ఎంపిపి లక్ష్మీగాయత్రి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి కుటుంబానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎంపిపి లక్ష్మీగాయత్రి తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో మెగా కంపెనీ నూతనంగా నిర్మిస్తున్న ఉపరితల జలాశయ నిర్మాణ పనులు చేపట్టేందుకు శుక్రవారం ఎంపిపి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ కిడ్ కింద పార్నపల్లె నుండి తాగునీటిని అందించేందుకు ఎస్సీ కాలనీలో జలాశయం పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో కూడా జలాశయ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు పార్నపల్లె నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వేంపల్లెలోని ఎస్సీ కాలనీ ప్రజలకు కూడా పార్నపల్లె నీటిని అందించేందుకు 2,50,000 లీటర్ల కెపాసిటీతో ఉపరితల జలాశయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయిన వెంటనే ప్రతి ఇంటికి పార్నపల్లె నీటిని అందివ్వనున్నట్లు వివరించారు. ఆ దిశగా పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జయరాం, మెగా కంపెనీ మేనేజర్ టి.సోమేశ్వరరావు, చీఫ్ జనరల్ మేనేజర్ బాలాజీ, విఆర్ఒ రామచంద్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోరుతూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 22న జరగబోవు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు, మానవత సభ్యులు ప్రధాన రోడ్ల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. శాంతికి చిహ్నమైన కపోతాలను ఎమ్మెల్యే, జడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఎగురవేశారు. పట్టణ నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఒకే కుటుంబంలా శాంతితో జీవించాలని వెంకటరామిరెడ్డి వారిచే ప్రమాణాలు చేయించారు. కార్యక్రమంలో మానవత జిల్లా ఉపాధ్యక్షులు రమణారెడ్డి, మానవతా చైర్మన్ రఘురామిరెడ్డి, సభ్యులు రమేష్, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతి కపోతాలను ఎగుర వేసి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలో పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి పట్టాలను శుక్లవారం స్థానిక కౌన్సిలర్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. స్థానిక ఆరవ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గైబునిసా మాట్లాడుతూ దాదాపు 1300 పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి తమ సొంతింటి కలను నెరవేర్చారని పేర్కొన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ కోకోకోల గౌస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ పెన్నా రషీద్, 12వ వార్డు ఇన్‌ఛార్జి యూసుఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పావనిని అభినందిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

పావనికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - చాపాడు

గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో 2వ ర్యాంకు సాధించిన మైదుకూరుకు చెందిన రైతుబిడ్డ పావనికి పలువురు నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక మాజీ కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు పట్టణానికి చెందిన భూమిరెడ్డి గంగయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పావని గ్రూప్-1 లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పావనిని శాలువా, పూలమాలతో సన్మానించారు. యర్రగుంట్ల తహశీల్దార్ నాగేశ్వరరావ్ గ్రూప్-1 ర్యాంకర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, అన్నవరం సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'పుట్టా' పరామర్శ

ఖాజీపేట : మండల పరిధిలోని సర్వర్‌ఖాన్‌పేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఖాజా ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం ఖాజా నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని పుట్టా ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, సారే రామానాయుడు, తూట్టే రాము యాదవ్, నంద్యాల సుబ్బయ్య యాదవ్, కమలాపురం గౌస్ మొహిద్దిన్, మునీర్ పాల్గొన్నారు.

జిల్లెల్ల గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

దువ్వూరు : మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల మద్దతు తమకు ఎక్కువగా ఉందన్నారు. భవిష్యత్తు గ్యారంటీపై ప్రతి గడప తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి బోరెడ్డి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన మున్సిపల్ కార్యాలయంలో సేవలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శనివారం నుంచి కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి సేవలు అందించనున్నారు. ఆ మేరకు శుక్రవారం కొత్త కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అఫీస్ హఫీ జుల్లాలు తమ కుర్చీలలో ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా వారిని కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్ శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది జులై 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు.


చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కరిస్తున్న కౌన్సిలర్లు

నేడు పెద్దరంగాపురంలో విగ్రహ ప్రతిష్టాపన

పులివెందుల రూరల్ : మున్సిపల్ పరిధిలోని పెద్ద రంగాపురంలో శనివారం నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గజ్జల వెంగల్‌రెడ్డి, ఆయన సోదరుడు గజ్జల వెంకటసూరారెడ్డి సొంత నిధులతో గ్రామస్తుల సహకారంతో దేవాలయాన్ని నిర్మించారు. దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట వేద పండితుల సమక్షంలో జరగనుంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తాదులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు


హర్షిత కుటుంబాన్ని అభినందిస్తున్న కౌన్సిలర్

ప్రొద్దుటూరు : ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1ఫలితాల్లో డిప్యూటి కలెక్టర్ స్థాయి సాధించిన సాయి హర్షితను శుక్రవారం కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని సాయి హర్షిత నిరూపించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ విద్యకు అందిస్తున్న సహకారం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. సాయి హర్షిత తలిదండ్రులను కూడా కౌన్సిలర్ అభినందించారు.

'పాలిటెక్నిక్' ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సింహాద్రిపురం : నిడివెలగల వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో సీట్లు ఖాళీలున్నాయన్నారు.

నేడు సరస్వతీదేవి ప్రమాణ స్వీకారం

చాపాడు : మైదుకూరు సాయిబాబా కల్యాణ మండపంలో శనివారం రాష్ట్ర మిషన్ శక్తి మెంబర్‌గా సరస్వతీ దేవి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొం టారని తెలిపారు.